క్లుప్తంగా

ఎర్నిమాంబ ఆలయ హుండీ ఆదాయం రూ.21 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవాదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారి హుండీలు లెక్కించారు. 50 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ. 21,03,182 వచ్చినట్లు ఆలయ ఈవో డీపీఎస్ సురేష్‌బాబా తెలిపారు. సహాయ కమిషనర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. వసంతకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఏపీబీవీ బ్యాంక్, కంచరపాలెం పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు



చిన్నారికి టీకా వేస్తున్న ఏఎన్ఎం కృష్ణవేణి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు బుధవారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఏఎన్ఎం కృష్ణవేణి ఆధ్వర్యంలో ఆశా వర్కర్ భవాని సహకారంతో పుట్టిన బిడ్డలతోపాటు 16 ఏళ్ల వరకు టీకాలు వేశారు. బిడ్డ పుట్టిన 24 గంటల్లోపు బీసీజీ(క్షయ నివారణ), ఓపీవీ, హెపటైటిస్-బీ(కాలేయ వ్యాధుల నివారణ), ఓపీవీ(పోలియో నివారణ) వ్యాక్సినేషన్ చేశారు. ఆరు వారాలకు ఓపీవీ-1, పది వారాలకు ఓపీవీ-2, 14 వారాలకు ఓపీవీ-3, 9 నెలలకు మీజిల్స్ రూబెల్లా-1 వేస్తున్నట్లు ఏఎన్ఎం కృష్ణవేణి తెలిపారు. అనంతరం పిల్లల తల్లులకు పలు సూచనలిచ్చారు. పిల్లలకు టీకాలు వేయించకపోతే వెంటనే వేయించుకోవాలన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

గోపాలపట్నం: ఒడిశా ఏజెన్సీ ప్రాంతం నుంచి వస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి 1.5కిలోల గంజాయి, 3 కిలోల లిక్విడ్ గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గోపాలపట్నం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాడేరు రూరల్ ఒడిశా బోర్డర్ నుంచి కేజిన్నర గంజాయి, 3కిలోల లిక్విడ్ గంజాయిని ఎన్ఏడీ కాకానినగర్ కు చెందిన రామ్ ప్రసాద్, విజయనగరానికి చెందిన భరత్ శ్యామ్‌సుందర్, మరో మైనర్ తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో విమాన్‌నగర్ నుంచి యల్లపువాని పాలెం ఎస్సీ కాలనీ రోడ్డులో వలవేసి పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి, లిక్విడ్ గంజాయితో పాటు 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపించారు.

పరిశుభ్రంగా ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్



పోలీస్ స్టేషన్ ఆవరణలో శుభ్రం చేయిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్‌గా శంఖబ్రత బాగ్చి బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రతి పోలీస్ స్టేషన్ శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు నగరంలోని పోలీస్ స్టేషన్లను అధికారులు శుభ్రం చేస్తున్నారు. ఇందులో భాగంగా బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సీఐ విజయకుమార్ శుభ్రతా చర్యలు చేపట్టారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న పాత ద్విచక్ర వాహనాలను తరలించి.. ఆవరణను శుభ్రం చేయించారు. చెట్లు, చెత్తాచెదారం తొలగించడంతో పోలీస్ స్టేషన్ పరిశుభ్రంగా కనిపిస్తోంది.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- ఆరోగ్య కేంద్రాలకు రోగుల తాకిడి
- ప్రతి రోజూ 10 కేసుల వరకు నమోదు



51వ వార్డులోని పట్టణ ఆరోగ్య కేంద్రం



53వ వార్డు ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం వచ్చిన రోగులు

మద్దిపాలెం: ఇటీవల కాలంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. నీటి వనరులు లేదా నీటి వనరుల్లో మార్పుల కారణంగా వైరల్ ఫీవర్‌లు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. శరీరాన్ని ప్రభావితం చేసే వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల అందిరికీ ఈ ఫీవర్ వాపిస్తుంది. వాతావరణంలో వస్తున్న మార్పులు కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రోజురోజుకూ వైరల్ ఫీవర్ల సంఖ్య పెరిగిపోతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ జ్వరాల బారిన పడేవారు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఈ క్రమంలో జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ, 53వ వార్డు శివనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రా(యూపీహెచ్‌సీల్లో)ల్లో వైరల్ జ్వరాలతో సుమారు 10 మంది వరకు ప్రతి రోజు వైద్యం కోసం వస్తున్నారు. సాధారణ ఓపీ వైద్యం కోసం 51వ వార్డులో రోజుకు మామూలుగా 50 నుంచి 70 మంది వరకు వస్తారు .అందులో ప్రతి 50 మందికి 6 నుంచి 8 వరకు వైరల్ ఫీవర్ కేసులు ఉన్నాయి. జ్వరాల బారిన పడ్డ వారిలో జలుబు, దగ్గు, తలనొప్పి, విరేచనాల సమస్యతో బాధపడుతున్నవారు ఎక్కువగా ఉన్నారు. వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వచ్చే ఫీవర్ ఒకరి నుంచి ఇంకొకరికి సోకుతుందని స్పష్టమవుతోంది.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వెంకటేష్

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత తప్పనిసరి

53వ వార్డు శివనగర్ ఆరోగ్య కేంద్రానికి 70 నుంచి 80 మంది సాధారణ వైద్యం కోసం ప్రతి రోజూ వస్తారు. ప్రస్తుతం ప్రతి 70 మందిలో సుమారు 10 మందికి వైరల్ ఫీవర్లు ఉన్నాయి. సరైన జాగ్రత్తలు పాటిస్తే వీటికి దూరంగా ఉండవచ్చని వైద్యులు సలహాలు ఇస్తున్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసర ప్రాంతాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకుంటే చాలా వరకు విషజ్వరాల వల్ల ముప్పు ఉండదని ఆయా ఆరోగ్య కేంద్రాల వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా తాగునీటిని మరగబెట్టి తాగడం మంచిదంటున్నారు. యూపీహెచ్‌సీకి వచ్చిన వారికి టెస్టులు నిర్వహించి తగు మందులు పంపిణీ చేస్తున్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు కూడా ఉన్న వాళ్లు ఆస్పత్రికి వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. వ్యాధి ముదిరిన వరకు నిర్లక్ష్యం పనికిరాదని, జ్వరం తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించి, వారి సూచనల మేరకు తగు వైద్యం పొందాలని సూచిస్తున్నారు.

భయపడనవసరం లేదు



వైరల్ ఫీవర్‌కు భయపడాల్సిన పనిలేదు. తగు జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వర్షా కాలంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యక్తిగత శుభ్రత కూడా పాటించాలి. వారానికో సారి డ్రైడే పాటించాలి. దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలు వచ్చే అవకాశముంది. దోమలు లేకుండా చూసుకోవాలి.

– డాక్టర్ వెంకటేష్, వైద్యాధికారి, 51వ వార్డు యూపీహెచ్‌సీ

జోరుగా వెబ్ ఆప్షన్ల ఎంపిక



కంచరపాలెం పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రంలో ఆప్షన్ల ఎంపికకు వచ్చిన విద్యార్థులు

మురళీనగర్: ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహిస్తున్న వెబ్ ఆప్షన్ల ప్రక్రియ బుధవారం జోరుగా సాగింది. ఈ నెల 8న వెబ్ ఆధారిత కోర్సులు, కాలేజీల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ మొదటి రెండు రోజులు సర్వర్ సహకరించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం సాయంత్రానికి సర్వర్ పూర్తి స్థాయిలో పనిచేయగా.. బుధవారం ఆప్షన్ల ప్రక్రియ సజావుగా సాగింది. దీంతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రానికి సుమారు వంద మంది విద్యార్థులు తరలివచ్చారు. సిస్టం అడ్మిన్ ఎస్.నాగరాజు పర్యవేక్షణలో ఆన్‌లైన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆదాయ ధ్రువ పత్రాలు, ఈడబ్ల్యూస్ సర్టిఫికెట్ల అప్‌లోడ్‌తోపాటు మొబైల్ నంబర్ మార్పు, నాన్ లోకల్ అభ్యర్థులు స్థిర నివాస పత్రాలు అప్‌లోడ్ చేసుకున్నారు. లెక్చరర్ సిహెచ్.అప్పలనాయుడు విద్యార్థులకు సహకరించారు. 12వ తేదీ వరకు ఆప్షన్లు పెట్టుకోవచ్చు. ఈ నెల 13న ఆప్షన్లు మార్చుకోవచ్చు.

‘గైస్’లో కోర్సుల నిర్వహణ పరిశీలన



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న బోర్డు సభ్యులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్) నిర్వహణను బుధవారం కాలేజీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు పరిశీలించారు. ఈ కాలేజీలో రెండు కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు లభించినందున వాటి నిర్వహణ తీరుపై డైరెక్టర్ల బృందం సమీక్ష నిర్వహించింది. ప్రొఫెసర్ పీఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రొఫెసర్ డీపీ నాయుడు, ప్రొఫెసర్ వి.పద్మశ్రీ, డాక్టర్ వోఎం రావ్, కేవీకే సుబ్బరాజు, అరుణలతో కూడిన బృందం కాలేజీలోని ప్రయోగశాలల నిర్వహణ, వాటిని విద్యార్థులు ఉపయోగించుకుంటున్న తీరు, ఇతర సౌకర్యాలను పరిశీలించింది. ఈ సందర్భంగా కెటలిస్ట్ న్యూస్ లెటర్‌ను బృంద సభ్యులు ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ, వివిధ విభాగాల హెడ్‌లు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: క్యాన్సర్ స్క్రీనింగ్‌పై నెల రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ నేటితో ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం కోసం సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇస్తున్న సంగతి విదితమే. అందులో భాగంగా హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ పర్యవేక్షణలో గత నెల 13వ తేదీ నుంచి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న మెడికల్ కాలేజీ వైద్య నిపుణులు (సామాజిక వైద్య శాస్త్ర అధ్యాపకులు, గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, రేడియాలజిస్ట్, సాధారణ సర్జన్లు, రేడియేషన్ అంకాలజిస్టులు, సర్జికల్ అంకాలజిస్టులు) శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గల గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, జిల్లా టీం వారు శిక్షణ తీసుకున్నారు. జిల్లాలో ఉన్న 91 మంది వైద్యులు, 9 మంది స్టాఫ్‌నర్సులు, 54 మంది సీహెచ్‌వో, 498 మంది ఏఎన్ఎంలకు బ్యాచ్‌ల వారీగా రోజుకు 40 మంది చొప్పున ఆంధ్ర వైద్య కళాశాలలో శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ఆధ్వర్యంలో జిల్లా ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ నోడల్ అధికారి డాక్టర్ కె. సాయిసుష్మ, సామాజిక వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎ. కృష్ణవేణి, ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ శిల్ప తదితరుల ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది.

ఆర్‌ఎంపీలకు గుర్తింపునివ్వాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో ఉత్తరాంధ్ర ఆర్‌ఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు

సీతమ్మధార: గ్రామీణ మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో ఎందరికో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ జీవిస్తున్న గ్రామీణ వైద్యులు ఎందరో ఉన్నారని ఉత్తరాంధ్ర ఆర్‌ఎంపీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి అన్నారు. డైమండ్ పార్కు వద్ద ఒక హోటల్‌లో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ వైద్యులకు గతంలో 429 జీవో 2008లో ఇచ్చారని, తరువాత కాలంలో ఆర్‌ఎంపీ వైద్యుల వ్యవస్థను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఉత్తరాంధ్రలోనే ఈ తరహా గ్రామీణ వైద్యులు సుమారు 9 వేల మంది ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు, పట్టణాల్లో 40 వేల మంది ప్రాథమిక వైద్యులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆర్‌ఎంపీ, పీఎంపీలను పట్టించుకోవాలని, ఎవరు మీద ఆధార పడకుండా వారికున్న అనుభవంతో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ ప్రొవైడర్లుగా నియమిస్తే గ్రామీణ పేద ప్రజలకు, మరోవైపు గ్రామీణ వైద్యుల కుటుంబాలకు ఆదుకున్న వాళ్లవుతారన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జోనల్ కార్యదర్శి ఎస్.సుగుణేశ్వరి, కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్ కార్యదర్శి, సంఘం సభ్యులు, సలహాదారులు కోన ప్రకాష్, కల్యాణి, జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, లోగీసా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలో డీఆర్‌ఎం భద్రతా తనిఖీలు



శివలింగపురం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో కేకే లైన్ కొత్తవలస–శివలింగపురం మధ్య బుధవారం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ భద్రతా తనిఖీలు నిర్వహించారు. శివలింగపురం స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ మార్గంలో జరుగుతున్న ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ పనులు, ట్రాక్ సర్క్యూట్స్, టన్నెల్స్, పాయింట్స్, క్రాసింగ్స్, బ్రిడ్జిల నిర్వహణ, ట్రాక్షన్ సబ్ స్టేషన్స్, వసతులు, భద్రతా ప్రమాణాలు, రక్షణ గోడలు వంటి ప్రతి పనిని క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షా కాలంలో బండరాళ్లు ట్రాక్‌లపై పడేందుకు అవకాశమున్న ప్రాంతాలల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం స్టేషన్ మాస్టర్, సిబ్బందితో డీఆర్‌ఎం మాట్లాడారు. టన్నెల్స్, ఘాట్ సెక్షన్లలో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్, సమాచార వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైళ్ల రాకపోకలు సాఫీగా సాగేందుకు అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని, విధి నిర్వహణలో ఏ మాత్రం ఆదమరచి ఉండరాదని అధికారులకు, సిబ్బందికి సూచించారు. తనిఖీల్లో ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సెంట్రల్ పార్క్‌ను సందర్శించిన వీఎంఆర్‌డీఏ కమిషనర్



సెంట్రల్ పార్కును సందర్శిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్ర, అధికారులు

మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్ర బుధవారం సెంట్రల్ పార్క్‌ను సందర్శించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా పాడైన చిల్డ్రన్ ప్లే పరికరాలు, సైన్ బోర్డ్‌లను సాధ్యమైనంత త్వరగా బాగు చేయించాలని అధికారులకు సూచించారు. అదే విధంగా వ్యర్థాల నిర్వహణ త్వరితగతిన చేపట్టాలని, నడక దారిలో పాడైన టైల్స్ స్థానంలో కొత్తవి వేయాలని తెలిపారు. పర్యటనలో సీఈ భవానీ శంకర్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు ఎస్‌వీఎస్ఎన్ రాజు, రామరాజు, రేంజ్ ఆఫీసర్ శ్యామల, డీఈ మురళీకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ బేగం తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



స్వీపింగ్ మిషన్ పనితీరును పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ: పారిశుధ్య కార్మికులు సమయపాలన పాటించాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. బుధవారం ఆయన జోన్ పరిధిలోని 12 వార్డుల్లో పర్యటించారు. టౌన్ కొత్త రోడ్డులో సిబ్బందిచే చెత్త ఎత్తించారు. పారిశుధ్య సిబ్బంది, క్లాప్ వాహనాల డ్రైవర్లతో మాట్లాడారు. సిబ్బంది తప్పకుండా ఎనిమిది గంటలు పని చేయాలన్నారు. చాలా మంది సిబ్బంది హాజరు వేయించుకుని పనుల్లో ఉండకుండా వెళ్లిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారిపై దృష్టి సారించామని త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్లాప్ వాహనాలు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలన్నారు. నిర్దేశించిన చెత్తను క్లాప్ వాహనాల్లో తీసుకు రావాలన్నారు. అలాగే ప్రతి వాహనానికి లాగ్ బుక్ ఉండాలన్నారు. వీటన్నింటినీ సెక్రటరీలు పర్యవేక్షించాలన్నారు. శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కూలిన స్తంభం.. తెగిపడిన వైర్లు



శ్రీనివాసనగర్‌లో విద్యుత్ స్తంభం కూలడంతో తెగిపడిన సర్వీస్ వైర్లు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులోని గౌరీ కల్యాణ మండపం వెనుక శ్రీనివాసనగర్‌లో గెడ్డపై కొత్తగా నిర్మిస్తున్న బాక్సు కల్వర్టు పనుల్లో భాగంగా అడ్డుగా ఉన్న చెట్టును తొలగించగా.. అది ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లపై పడింది. దీంతో అక్కడ ఉన్న విద్యుత్ స్తంభం, దానికి అనుసంధానం చేసిన 50 గృహ విద్యుత్ సర్వీస్ వైర్లు తెగిపడ్డాయి. ఒక్కసారిగా తెగిపడిన విద్యుత్ వైర్లతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. గృహాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుధవారం జరిగిన ఈ ఘటనలో ఒకరి ఇల్లు స్వల్పంగా ధ్వంసమైంది. సిబ్బంది నిర్లక్ష్యంతోనే స్తంభం కూలి, విద్యుత్ వైర్లు తెగిపోయాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు తెగిన విద్యుత్ కనెక్షన్లు సరిచేసే పనిలో నిమగ్నమయ్యారు. కూలిన అదే విద్యుత్ స్తంభాన్ని పక్కన నిలబెట్టారు. కాంక్రీట్ వేసి కొత్త స్తంభం వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా బీవీపీ వ్యవస్థాపక దినోత్సవం



జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభిస్తున్న ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు

సీతంపేట: భారత్ వికాస్ పరిషత్(బీవీపీ) వ్యవస్థాపక దినోత్సవ వక్షోత్సవాల ముగింపు ఉత్సవం బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ విద్యార్థులను దేశభక్తి కలిగిన పౌరులుగా తీర్చిదిద్దేందుకు బీవీపీ దేశ స్థాయిలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. బీవీపీ సంస్థ అభివృద్ధికి దోహదపడుతున్న సభ్యులను అభినందించారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ దైవభక్తిని, దేశభక్తిని పెంపొందించుకుని రాణించాలన్నారు. బీవీపీ జాతీయ స్థాయి ప్రతినిధి రమేష్ చండ్జైన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంలో 1987లో మొట్టమొదటి శాఖగా భారత్ వికాస్ పరిషత్‌ను స్థాపించామని తెలిపారు. స్వామి వివేకానందుని ఆశయాలతో బీవీపీ ముందుకెళ్తోందన్నారు. ఇప్పటి వరకు విశేష సేవలందించిన బీవీపీ ప్రతినిధులను అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో బీవీపీ ప్రాంత అధ్యక్షులు వంకాయల సన్యాసిరాజు, ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎం.వి.వి.సత్యనారాయణ, మీడియా ఇన్‌చార్జి ఎం.వి.రాజశేఖర్, విశాఖ అధ్యక్షుడు సిహెచ్.వి.సత్యనారాయణ, కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారి జి.ఎస్.వి.మాణిక్యాలరావు, పి.షర్మిల, ఎం.ఎస్.ఎల్.శైలజ, వనజ పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న రిటైర్డ్ న్యాయమూర్తి సుధామణి

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని రిటైర్డ్ న్యాయమూర్తి కె.సుధామణి అన్నారు. మురళీనగర్ బృందావన్ పార్కులో క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక హితం కోసం మహిళలు విశేష కృషి చేస్తున్నారన్నారు. సమాజంలో నేటి మహిళల స్థితిగతులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, చట్టంలో వీటి పరిష్కారానికి ఉన్న అవకాశాలను వివరించారు. మహిళలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. వీలునామాకు సంబంధించి చట్టాలను ఆమె తెలిపారు. గృహహింస చట్టంలోని పలు అంశాలను న్యాయవాది పుష్పలత వివరించారు. అనంతరం సుధామణిని మహిళలు ఘనంగా సత్కరించారు. ఈ నెలలో పుట్టిన రోజు చేసుకుంటున్న మహిళలకు చిరు కానుకలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సిహెచ్.లక్ష్మి, కోశాధికారి పి.కమల, ఉపాధ్యక్షురాలు టి.లీలానాయుడు, జాలీ వాకర్ మాధవీలత, పూర్వ అధ్యక్షులు టి.శేషామణి, కె.మాధవి, డి.శిరీష, కార్యవర్గ సభ్యులు రాధ, కృష్ణ వేణి, పుష్ప, జయ, లక్ష్మీకుమారి, సుగుణ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

బాక్సర్ శ్రీనుకు సత్కారం



బాక్సర్ కలిశెట్టి శ్రీనును సత్కరిస్తున్న రఘురామ్, గొర్లె చందు

కంచరపాలెం: ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ చాంపియన్‌షిప్‌లో గెలుపొందిన విశాఖ బాక్సర్ కలిశెట్టి శ్రీనును బుధవారం కైలాసపురం బాక్సింగ్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్ జీజీకే బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన పది కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. విశాఖకు చెందిన కలిశెట్టి శ్రీను ఆంధ్రప్రదేశ్ తరఫున సూపర్ బాంటామ్ కేటగిరీలో ప్రత్యర్థి తెలంగాణ బాక్సర్ వివేక్‌పై విజయం సాధించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడు యల్లపు రఘురామ్, విశాఖ పోర్ట్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు కలిశెట్టి శ్రీనును సత్కరించి అభినందించారు. రఘురామ్ మాట్లాడుతూ ఆగస్ట్ 22న జరిగే వరల్డ్ బాక్సింగ్ కౌన్సిల్ చాంపియన్‌షిప్‌కు శ్రీను ఎంపికయ్యే అవకాశముందన్నారు. మరింత కృషి చేయాలని అతడికి సూచించారు. కార్యక్రమంలో రిఫరీలు అమ్మోరు, పృథ్వీ రామారావు, రూబెన్, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ సునీల్, సతీష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కల్యాణ మండపం

- కూలే స్థితిలో గోడలు
- అధికారులు పట్టించుకోవాలని స్థానికుల విజ్ఞప్తి



బీటలు వారిన మండపం గోడ



నక్కవానిపాలెం వివేకానంద కల్యాణ మండపం ప్రధాన గేటు వద్ద ధ్వంసమైన సిమెంట్ పలకలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని శ్రీవివేకానంద కల్యాణ మండపం శిథిలావస్థకు చేరుతోంది. మండపంలోకి వెళ్లే ప్రధాన గేటు వద్ద సిమెంట్ పలకలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గోడలు బీటలు వారి కూలిపోయే స్థితికి చేరి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. అదే రోడ్డులో అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఆ ప్రాంతంలో నిత్యం స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. గోడ కూలిపోతే పెద్ద ప్రమాదమే సంభవిస్తుంది. దీంతో నక్కవానిపాలెం వాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కల్యాణ మండపం శిథిలావస్థకు చేరుకుంటున్నా.. జీవీఎంసీ అధికారులు స్పందించడం లేదు. ఈ మండపం లోపల శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం కూడా ఉంది. ఇక్కడ ప్రతి రోజూ పారిశుధ్య కార్మికులు హాజరు వేసుకుని రాకపోకలు సాగిస్తుంటారు. పొరపాటున కాలువలో పడితే కాలు విరడగం ఖాయం. అధికారులు దృష్టిసారించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.